సాక్షి సూర్యాపేట

బుధవారం । 25 । అక్టోబర్ । 2023



పోరుగడ్డ.. తుంగతుర్తి

నైజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన ఉద్య మానికి గొప్ప నాయకులను అందించిన పోరుగడ్డ తుంగతుర్తి

- 10లో



సాగర్‌లో జడ్జీలు

సాగర్‌కు పాట్నా హైకోర్టు జడ్జి జస్టిస్ అంజనీ కుమార్‌శరణ్, ఒడిశా హైకోర్టు జడ్జి జస్టిస్ గౌరీశంకర్ సత్పతి వచ్చారు.

- 10లో



యాదాద్రిలో దసరా ఉత్సవాలు

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో మంగళవారం దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు.

- 10లో

న్యూస్‌రీల్

27న యోగాసన, జూడో క్రీడాకారుల ఎంపిక

మునగాల(కోదాడ): ఉమ్మడి జిల్లాస్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 27న నల్లగొండ ఇండోర్ స్టేడియంలో ఉదయం 10 గంటలకు యోగాసన, జూడో క్రీడాకారుల ఎంపిన పోటీలు నిర్వహించనున్నట్లు సూర్యాపేట జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎండీ.అజాంబాబా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–14,17 విభాగలలకు చెందిన బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు తమ వయస్సు ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని సూచించారు. ఈ సదవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

27న పేటకు అమిత్‌షా రాక




సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు



సూర్యాపేట: ఈనెల 27 సూర్యాపేటకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా వస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలో జనగర్జన సభ ఏర్పాట్లను వారు పరిశీలించిన అనంతరం మాట్లాడారు. జిల్లా కేంద్రంలో జరిగే సూర్యాపేట జనగర్జన సభకు ఆయన హాజరుతున్నట్లు పేర్కొన్నారు. లక్ష మందితో ఈ సభ నిర్వహిస్తామన్నారు. సభకు రెండు రోజుల ముందు కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలకు బీజేపీ అభ్యర్థులను ప్రకటిస్తామని చెప్పారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా ఎంత ఖర్చుపెట్టినా రాష్ట్ర ప్రజలు బీఆర్‌ఎస్‌ను గెలిపించే పరిస్థితిలో లేరన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే అది బీఆర్‌ఎస్‌కు వేసినట్లేనని ప్రజలు భావిస్తున్నారన్నారు. 2014, 2018 ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేస్తే వారు గెలిచి బీఆర్‌ఎస్‌లో చేరారని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా అదే జరుగుతని ప్రజలు విశ్వసిస్తున్నారని వారు అన్నారు.

యాదాద్రీశుడి సన్నిధిలో బిహార్ ఆడిటర్స్ బృందం



ఆలయ ముఖ మండపంలో బిహార్ పంచాయితీ రాజ్ అడిటర్స్ బృందం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారిని బిహార్ రాష్ట్రం పంచాయతీ రాజ్ విభాగానికి చెందిన 175 మంది ఆడిటర్స్ బృందం సోమవారం దర్శించుకుంది. ఈ సందర్భంగా స్వయంభూ లక్ష్మీనరసింహస్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. 7 రోజుల పాటు డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందిన 175 మంది ఆడిటర్స్ యాదాద్రి ఆలయాన్ని ఆ సంస్థ డైరెక్టర్ శ్రీకాంత్, కోర్స్ కో ఆర్డినేటర్ జయశ్రీల పర్యవేక్షణలో సందర్శించి, ఆలయ వాస్తు, నిర్మాణ నైపుణ్యాలను తిలకించారు. వారి వెంట జిల్లా అధికారులు, అర్చకులు ఉన్నారు.

ముగిసిన శరన్నవరాత్రోత్సవాలు



శివాలయంలో మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్న పూజారులు

యాదగిరిగుట్ట: యాదాద్రీశుడి ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో శ్రీదేవిశరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ముగిసాయి. ఉదయం మహా పూర్ణాహుతి నిర్వహించిన పూజారులు కలశోద్వాసన నిర్వహించారు. శ్రీలలిత సహస్రనామార్చన, పారాయణాలు, జపములు చేపట్టారు. అమ్మ వారికి కుంకుమార్చన పూజలు వైభవంగా జరిపించారు. అనంతరం ఆలయంలో అమ్మ వారి సేవను ఊరేగించారు. ఆలయ దక్షిణ దిశలోని ప్రాకారంలో శమీ వృక్షానికి పూజలు చేశారు. ఆయా వేడుకల్లో ఈఓ గీతారెడ్డి, ఆలయ అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దసరా సంబరం



సూర్యాపేట పట్టణంలోని జమ్మిగడ్డలో సోమవారం దసరా ఉత్సవాల్లో భాగంగా శమీపూజలో పాల్గొన్న విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి దంపతులు, ఎంపీ, మున్సిపల్ చైర్‌పర్సన్

మట్టపల్లి క్షేత్రంలో శమీ పూజ

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో రెండు రోజుపాటు జరగనున్న విజయదశమి వేడుకల్లో భాగంగా మంగళవారం సాయంత్రం ఆలయ ఆవరణలో జమ్మిచెట్టు వద్ద అర్చకులు శమీపూజ నిర్వహించారు. అనంతరం గరుడవాహనంపై ఆలయ తిరుమాడవీధుల్లో శ్రీస్వామి అమ్మవార్లను ఊరేగించారు. హుజూర్‌నగర్ మాజీ జెడ్పీటీసీ చావా కిరణ్మయి వాసుదేవరావు దంపతులచే అద్దాల మండపంలో శ్రీస్వామివారికి పవళింసేవ చేపట్టారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాముల శివారెడ్డి, మాజీ జెట్పీటీసీ అరుణాసైదులు పాల్గొన్నారు.



మట్టపల్లి ఆలయంలో శమీపూజ నిర్వహిస్తున్న అర్చకులు

సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి

- అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేలా ప్రణాళిక
- కోడ్ ఉల్లంఘించిన వారిపై చర్యలు
- అంతర్ రాష్ట్ర, జిల్లా చెక్‌పోస్టుల వద్ద నిఘా
- రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్తే ఆధారాలు చూపాల్సిందే
- జిల్లా ఎస్పీ బీకే రాహుల్ హెగ్డే



సాక్షి INTERVIEW

సూర్యాపేట: 'ఎన్నికలను పకడ్బందీగా ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.. ఇప్పటికే 3 వేల మందికి పైగా పోలీస్ సిబ్బందితో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశాం.. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే ఉక్కుపాదం మోపుతాం 'అని జిల్లా ఎస్పీ బీకే రాహుల్ హెగ్డే అన్నారు. ఎన్నికల నిర్వహణ, కోడ్ అమలు, భద్రతా ఏర్పాట్లపై సాక్షికి ఎస్పీ ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే..

ఎన్నికల నిర్వహణలో పోలీస్ బందోబస్తు అవసరం ఉంది. కాబట్టి జిల్లా పోలీస్ సిబ్బందితో పాటుగా కేంద్ర బలగాలను ఎన్నికల విధుల్లో వినియోగించుకుంటున్నాం. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పోలీసులకు అవసరమైన శిక్షణ కూడా పూర్తయింది. జిల్లాలో ఏడు అంతర్‌రాష్ట్ర, ఏడు అంతర్ జిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. అక్రమంగా తరలిస్తున్న నగదు, మద్యం రవాణాను చెక్‌పోస్టుల వద్ద అడ్డుకుంటున్నాం. ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేస్తాం. ర్యాలీలు, సభలు, సమావేశాలకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సిందే.

త్వరలో బస్టాండ్లలోనూ తనిఖీలు

ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం.. వాహన తనిఖీల్లో రూ.50 వేలు ఆ పైన డబ్బు దొరికితే అవి వేటికి సంబంధించినవో తనిఖీ బృందాలకు వివరించాలి. వాటికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను కూడా చూపించాలి. రూ.10 లక్షలకు పైన ఒక వాహనంలో దొరికితే తనిఖీ బృందాలు ఆదాయ పన్ను శాఖ అధికారులకు సమాచారం ఇస్తున్నాయి. చెక్ పోస్టుల్లోనే కాకుండా రెండు, మూడు రోజుల్లో బస్టాండ్లలో తనిఖీలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. జిల్లాలో తనిఖీల్లో ఇప్పటి వరకు రూ. 2 కోట్ల నగదు, 2430 లీటర్ల మద్యం, 150 కేజీల గంజాయి, రూ.1.30 కోట్లు విలువ చేసే సిల్వర్, గోల్డ్, రూ.90 లక్షలు విలువ చేసే చీరలు సీజ్ చేశాం.

420 మంది రౌడీషీటర్ల గుర్తింపు

ఎన్నికల నిర్వహణకు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాం. ఇప్పటికే రెండు సార్లు సమీక్ష సమావేశాలు నిర్వహించి జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని సమాయత్తం చేశాం. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారు, సంఘ విద్రోహులు, పాత నేరస్తులను కట్టడి చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా 420 మంది రౌడీషీటర్లను, పద్ధతి మార్చుకోవాలని 600 మందిని హెచ్చరించాం. 2 వేల కు పైగా మందిని తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేశాం.

అవాంఛనీయ ఘటనలు జరగకుండా..

జిల్లాలో 1,038 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. గత ఎన్నికల్లో జరిగిన సంఘటనల ఆధారంగా 300 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించాం. వాటి వద్ద పటిష్ట భద్రతను ఏర్పాటు చేస్తాం. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

సోషల్ మీడియా పోస్టులపై ప్రత్యేక నజర్

సోషల్ మీడియా పోస్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఇతరులను కించపరిచేలా, ప్రజలను రెచ్చగొట్టేలా.. ఇతరుల మనోభావాలను దెబ్బతీసేలా ఉద్దేశపూర్వకంగా పోస్టులు పెట్టిన వారిపై నిఘా ఉంచి చర్యలు తీసుకుంటాం. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు వ్యక్తిగత దూషణలు, అవమానకరంగా కించపరిచేలా పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటాం.

అసాంఘిక శక్తుల కదలికలపై..

అసాంఘిక శక్తులు, చట్టవిరుద్ధ కార్యకలాపాలు నిర్వహించే వారిని గుర్తించి వారి ప్రతి కదలికపై నిఘా ఉంచాం. అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు నిర్వహించకుండా అన్ని రాజకీయ పార్టీలకు సమాచారం ఇచ్చాం. ఎన్నికల నియమావళిని అందరూ పాటించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఓటర్లు నిర్భయంగా ఓటేయాలని సూచిస్తున్నాం.

బీఆర్‌ఎస్..హుషార్

- సీఎం సభలతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్న గులాబీ పార్టీ
- రేపు మునుగోడులో కేసీఆర్ సభ
- 29, 31 తేదీల్లోనూ ఆరు నియోజకవర్గాల్లో సభలు
- మిగతా ఆరు స్థానాల్లో అభ్యర్థుల ఖరారు దిశగా కాంగ్రెస్
- నేడు ఎలక్షన్ కమిటీ సమావేశంలో ఫైనల్ అయ్యే అవకాశం
- కమల దళంలో కానరాని హడావుడి.. ఎదురుచూపుల్లో ఆశావహులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నామినేషన్ల గడువు సమీపిస్తుండటంతో అధికార బీఆర్‌ఎస్ పార్టీ ప్రచారం జోరు పెంచింది. ఇప్పటికే అభ్యర్థులు ప్రచారంలోకి దిగగా.. సీఎం బహిరంగ సభలతో మరింత హోరెత్తనుంది. ఉమ్మడి జిల్లాలో కేసీఆర్ ఈ నెల 16న భువనగిరిలో బహిరంగ సభలో పాల్గొన్నారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లోనూ ఈ వారం రోజుల్లో సీఎం మూడు ప్రచార సభల్లో పాల్గొనబోతున్నారు. 26, 29, 31 తేదీల్లో ఏడు నియోజకవర్గాల్లో బహిరంగ సభల్లో కేసీఆర్ పాల్గొనేందుకు బీఆర్‌ఎస్ ఏర్పాట్లు పూర్తి చేసింది. 26వ తేదీన ముఖ్యమంత్రి కేసీఆర్ మునుగోడులో జరిగే బహిరంగ సభలో పాల్గొననున్నారు. అదే విధంగా 29వ తేదీన మూడు నియోజక వర్గాల్లో నిర్వహించనున్న బహిరంగ సభల్లో సీఎం పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటిగంటకు కోదాడలో, 2 గంటలకు తుంగతుర్తి నియోజకవర్గంలో, 3 గంటలకు ఆలేరు నియోజకవర్గంలో నిర్వహించే బహిరంగ సభల్లో పాల్గొంటారు. అదేవిధంగా ఈ నెల 31వ తేదీన కూడా ఉమ్మడి జిల్లాలో మూడు బహిరంగ సభల్లో కేసీఆర్ పాల్గొననున్నారు. హుజూర్‌నగర్, మిర్యాలగూడ, దేవరకొండలో జరిగే బహిరంగ సభలకు హాజరవుతారు. మొదటి విడత ప్రచారంలో కేసీఆర్ ఉమ్మడి జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో ఈ నెల 31వ తేదీ లోపే బహిరంగ సభలు ముగిస్తున్నారు. నామినేషన్ల పర్వం మొదలైన తర్వాత మిగిలిన నియోజకవర్గాల్లో నిర్వహించే ప్రచార సభల్లో సీఎం పాల్గొనే అవకాశం ఉంది.



బీజేపీలో తప్పని ఎదురుచూపులు..

బీజేపీలో అభ్యర్థులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఇప్పటికే బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఎన్నికల ప్రచార జోరు పెంచగా.. బీజేపీ మాత్రం ఇంకా వేగం పెంచలేదు. ఉమ్మడి జిల్లాలో 12 నియోజకవర్గాలకు నాలుగు స్థానాల్లో మాత్రమే అభ్యర్థులను ప్రకటించింది. మిగిలిన 8 స్థానాల్లో అభ్యర్థులు ఖరారు కాకపోవడంతో ప్రచారం కూడా పెద్దగా చేయని పరిస్థితి నెలకొంది. దీంతో ఆయా నియోజకవర్గాల్లో ఆశావహులకు ఇంకా ఎదురు చూపులు తప్పడం లేదు. అధిష్టానం మిగిలిన స్థానాలకు ఎప్పుడు అభ్యర్థులను ప్రకటిస్తుందో, ఎప్పుడు ప్రచారం చేసుకోవాలో అర్థం కావడం లేదని ఆశావహులు అంటున్నారు.

రెండో జాబితా కసరత్తులో కాంగ్రెస్..

కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లాలో ఆరు నియోజకవర్గాల్లో అభ్యర్థులను మొదటి జాబితాలో ప్రకటించింది. నల్లగొండ, నకిరేకల్, ఆలేరు, కోదాడ, హుజూర్‌నగర్, నాగార్జునసాగర్ నియోజకవర్గాల్లో పోటీలో ఉండబోయే అభ్యర్థులను ఫైనల్ చేసింది. ఇక రెండో జాబితాలో.. అన్ని నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసేందుకు ఆ పార్టీ కసరత్తు చేస్తోంది. అయితే, బుధవారం కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్ కమిటీ సమావేశం జరగనుంది. ఆ సమావేశంలో జిల్లాలోని మిగతా ఆరు నియోజక వర్గాలకు అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉందన్న చర్చ సాగుతోంది.

వారిద్దరు ఒక్కటయ్యారు!

- చేతులు కలిపిన ఉత్తమ్, పందిరి నాగిరెడ్డి

కోదాడ: కోదాడ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం తీవ్ర ప్రయత్నం చేసినా రాకపోవడంతో కినుక వహించిన స్థానిక ఎంఎస్ విద్యాసంస్థల అధినేత పందిరి నాగిరెడ్డి ఎట్టకేలకు మెత్తపడ్డారు. ఉత్తమ్‌తో నాగిరెడ్డి చేతులు కలిపారు. సంవత్సరం కాలంగా ఆయన రేవంత్‌రెడ్డి వర్గంగా కోదాడ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను వేరుగా నిర్వహిస్తూ వచ్చారు. పందిరి ఫౌండేషన్ పేరుతో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కోదాడ కాంగ్రెస్ టికెట్ పద్మావతిరెడ్డికి కేటాయించడంతో కొద్ది రోజులుగా ఆయన మౌనంగా ఉంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు ఇంట్లో జరిగిన సమావేశంలో నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌తో చర్చలు జరిపిన అనంతరం ఇద్దరు నేతలు చేతులు కలిపారు. రానున్న ఎన్నికల్లో కోదాడ కాంగ్రెస్ అభ్యర్థి ఎన్ . పద్మావతిరెడ్డి గెలుపు కోసం తన వంతు ప్రయత్నం చేస్తానని ఈ సందర్భంగా నాగిరెడ్డి ప్రకటించారు. ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువగా ఉంటుందని ఎవరైనా టికెట్ కోసం ప్రయత్నించ వచ్చని, చివరికి పార్టీ టికెట్ ఇచ్చిన అభ్యర్థి గెలుపు కోసం పని చేయాలని సూచించారు. విద్యావేత్త నాగిరెడ్డి సేవలను పార్టీ పూర్తిస్థాయిలో వినియోగించుకొని ఆయనకు సముచిత స్థానం కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, మహబూబ్‌జానీ, మధు, సంపెట రవి, గుండపనేని నాగేశ్వరరావు పాల్గొన్నారు.



కాంగ్రెస్ అసంతృప్త నేత నాగిరెడ్డితో ఎంపీ ఉత్తమ్, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు

మునుగోడులో పోటీ చేయాలని సీపీఐ తీర్మానం

నల్లగొండ టౌన్ : మునుగోడు అసెంబ్లీ స్థానాన్ని పొత్తులో భాగంగా సీపీఐకి కేటాయించాలని ఆ పార్టీ జిల్లా కౌన్సిల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. మంగళవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆపార్టీ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకటరెడ్డి మాట్లాడారు. పొత్తులో భాగంగా ఇతర పార్టీలకు సీటు కేటాయించడం వల్ల పార్టీ తీవ్రంగా నష్టపోతుందని పేర్కొన్నారు. 2018 ఎన్నికల్లో పొత్తులో భాగంగా కాంగ్రెస్ పార్టీకి ఇవ్వడం వల్ల సీపీఐ నష్టపోయిన విషయాన్ని గుర్తు చేశారు. ఈసారి పొత్తులో సీటు దక్కని పక్షంలో ఒంటరిగా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని తీర్మానించారు. ఈ సమావేశానికి పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యురాలు గిరి రామ అధ్యక్షత వహించారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్‌రెడ్డి, లోడంగి శ్రవణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, ఆర్.అంజచారి, బొల్గూరి నర్సింహ, వెంకటేశ్వర్లు, నల్పరాజు రామలింగయ్య, బొడ్డుపల్లి వెంకట్ రమణ పాల్గొన్నారు.

గ్రీవెన్స్ కమిటీ ద్వారా త్వరగా కేసులు పరిష్కారం

- జిల్లా ఎన్నికల అధికారి వెంకట్రావ్

దురాజ్‌పల్లి(సూర్యాపేట) : స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువులను తిరిగి అప్పగించాలంటే తగిన ఆధారాలు చూపించాలని, గ్రీవెన్స్ కమిటీ ద్వారా త్వరితగతిన కేసుల పరిష్కారం ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడారు. రూ.50వేలకు మించి రూ.10లక్షలకు లోపు నగ, లేదా బంగారం, వెండి, ఇతర వస్తువులకు సంబంధించి ఆధారాలను కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తు రూమ్ నంబర్12లో గల గ్రీవెన్స్ కమిటీకి అప్పీల్ చేస్తే పరిశీలించి వెంటనే విడుదల చేస్తుందన్నారు. రూ.10లక్షల కన్నా మించిన వాటికి సంబంధించి నగదును, బంగారం, వెండి, వస్తువులు స్వాధీనం చేసుకున్న కేసుల్లో ఆదాయ పన్ను ,వాణిజ్య పన్నుల శాఖలకు సమాచారం అందించి వారి నుంచి క్లియరెన్స్ రాగానే గ్రీవెన్స్ కమిటీ విడుదల చేస్తుందని చెప్పారు.

ఇప్పటి వరకు 111 కేసులు..

జిల్లాలో 24వ తేదీ వరకు మొత్తం 111 కేసులు సీజ్ అయ్యాయని, ఇందులో 99 నగదుకు సంబంధించినవి , 3 బంగారం, వెండి కేసులు, 9 చీరలు, గార్మెంట్స్ , బ్లాంకెట్లు, ఫ్యాన్ లు ,గ్రైండర్ లు , ఏసీలు, ఫ్రిజ్‌లు, ఆట వస్తువులకు సంబంధించినవి ఉన్నాయన్నారు. వీటన్నింటి విలువ రూ.3,37,12,485 ఉంటుందన్నారు. ఈ 111 కేసులకు సంబంధించి మంగళవారం వరకు 72 కేసుల విషయంలో సంబంధీకులు గ్రీవెన్స్ కమిటీకి అప్పీలు చేసుకున్నారని, పరిశీలించి నగదుకు సంబంధించి 63 కేసులవి రూ.89,72,300లను విడుదల చేశారన్నారు. బంగారము, వెండి కి సంబంధించి ఒక కేసును విడుదల చేసినట్లు వివరించారు. ఏమైనా సందేహాలు ఉంటే జిల్లా గ్రీవెన్స్ కమిటీ చైర్మన్ జి. సురేష్ సెల్ నంబర్ : 8374566222, కమిటీ మెంబర్ రవికుమార్ సెల్ నంబర్: 7799934305, గ్రీవెన్స్ కమిటీ కన్వీనర్ జిల్లా సహకార అధికారి ఎస్. శ్రీధర్ 9100115651 లను సంప్రదించాలని సూచించారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..



హుజూర్‌నగర్ : కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువా కప్పుతున్న ఎంపీ ఉత్తమ్

హుజూర్‌నగర్ : రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన ఏఎంసీ చైర్‌పర్సన్ దొంతగాని లక్ష్మమ్మ, మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, కౌన్సిలర్ దొంతగాని పద్మ, ఎంపీటీసీ జయమ్మ, వార్డు మెంబర్లు లక్ష్మణరావు, గోపమ్మ, కడియాల రామకృష్ణ లతో పాటు పలువురు ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అలాగే 24,25 వార్డులు, సీతారం నగర్‌కు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బెదిరింపు రాజకీయాలు ఎంతో కాలం నడవవు అని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లిఖార్జున్, కౌన్సిలర్లు శ్రవణ్ కుమార్, కోతి సంపత్‌రెడ్డి, నాయకులు గెల్లి రవి, యరగాని నాగన్న, అల్లం ప్రభాకర్ రెడ్డి, అరుణ కుమార్, ఈ సుబ్బారావు, మల్లయ్య, ఆదెర్ల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల్లో పటిష్ట పోలీస్ భద్రత

- ఎస్పీ రాహుల్‌హెగ్డే

సూర్యాపేట క్రైం: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలో పటిష్టమైన పోలీస్ భద్రత ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. కేంద్ర బలగాల విధుల నిర్వహణపై సంబంధిత అధికారులతో మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల నిర్వహణ సందర్భంగా జిల్లాలో పోలీస్ సిబ్బందికి సహాయంగా 76సెక్షన్ల పారామిలటరీ సిబ్బంది విధులు నిర్వర్తించనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా 30సెక్షన్ల సిబ్బంది జిల్లాకు వచ్చారని ఎస్పీ చెప్పారు. ముఖ్యంగా పోలీస్ చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు విలువైన సేవలు అందించేలా విధులు నిర్వహించాలన్నారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకునేలా ప్రతి పౌరుడు తన ఓటు హక్కును స్వేచ్ఛగా సద్వినియోగం చేసుకునేలా రక్షణ కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో పారామిలటరీ అధికారులు, అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీలు నాగభూషణం, ప్రకాష్, ఇన్‌స్పెక్టర్లు రాజేష్, మహేష్, రాజశేఖర్, శివశంకర్, రాము, రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ హెగ్డే



జిల్లా పోలీస్ కార్యాలయంలో పూజలు చేస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

అందరూ సంతోషంగా ఉండాలి

ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని జిల్లా ఎస్పీ బీకే రాహుల్ హెగ్డే ఆకాంక్షించారు. విజయదశమి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయుధ పూజ, అనంతరం వాహన పూజ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు.కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీలు నాగభూషణం, ప్రకాష్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాజేష్, మహేష్, నారాయణ రాజు, సీఐలు రాజశేఖర్, శివశంకర్, రామలింగా రెడ్డి, రాము పాల్గొన్నారు.

చట్టసభల్లో 'చిట్యాల' ముద్ర

- 1967 నుంచి చిట్యాల మండలవాసుల ప్రాతినిధ్యం
- ఉరుమడ్ల గ్రామం నుంచే ముగ్గురి ఎన్నిక


నర్రా రాఘవరెడ్డి


గుత్తా మోహన్‌రెడ్డి


చెరుపల్లి సీతారాములు


గుత్తా సుఖేందర్‌రెడ్డి


కంచర్ల భూపాల్‌రెడ్డి

చిట్యాల: ప్రస్తుత నకిరేకల్ నియోజకవర్గంలోని చిట్యాల మండలానికి చెందిన పలువురు నాయకులు 1967 నుంచి చట్టసభలకు ఎన్నికవుతున్నారు. లోక్‌సభ, శాసనసభ, శాసన మండలికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. చిట్యాల మండలానికి చెందిన నాయకులు ఇప్పటి వరకు కూడా ఏదో ఒక చట్ట సభకు ఎన్నికవుతూ ఈ మండలానికి రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు తెస్తున్నారు.

చట్ట సభల్లో ప్రాతినిధ్యం ఇలా..

- చిట్యాల మండలంలోని వట్టిమర్తి గ్రామానికి చెందిన సీపీఎం నేత నర్రా రాఘవరెడ్డి పలుమార్లు నకిరేకల్ నుంచి శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు. 1967లో, 1978 నుంచి 1994 వరకు ఆరు పర్యాయాలు ఆయన నకిరేకల్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. సీపీఎం శాసనసభ పక్ష నేతగా కూడా కొనసాగారు.
- ఉరుమడ్ల గ్రామానికి చెందిన గుత్తా మోహన్‌రెడ్డి 1978లో కాంగ్రెస్ పార్టీ నుంచి నల్లగొండ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అదే విధంగా 1983లో ఇండింపెండెంట్‌గా పోటీచేసి నల్లగొండ నుంచి రెండోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అప్పట్లో చిట్యాల మండలం నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఉండేది. గుత్తా మోహన్‌రెడ్డి 1985లో కొన్నిరోజుల పాటు ఆయన అప్పటి సీఎం నాదెండ్ల భాస్కర్‌రావు మంత్రివర్గంలో వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేశారు.
- ఉరుమడ్ల గ్రామానికే చెందిన గుత్తా సుఖేందర్ రెడ్డి నల్లగొండ పార్లమెంట సభ్యుడిగా 1999, 2009, 2014 ఎన్నికల్లో ఎన్నికయ్యారు. ఆ తర్వాత 2019 మొదటిసారి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2021లో మరోమారు ఎమ్మెల్సీగా ఎన్నికై ప్రస్తుతం రాష్ట్ర శాసనమండలి చైర్మన్‌గా ఉన్నారు.
- నల్లగొండ ప్రస్తుత ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి స్వగ్రామం కూడా ఉరుమడ్ల కావడం విశేషం. భూపాల్‌రెడ్డి 2018లో నల్లగొండ ఎమ్మెల్యేగా మొదటిసారి ఎన్నికయ్యారు. ప్రస్తుత ఎన్నికల్లో ఆయన మరోమారు బీఆర్‌ఎస్ పార్టీ తరపున నల్లగొండ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉన్నారు.
- నేరడ గ్రామానికి చెందిన సీపీఎం నేత చెరుపల్లి సీతారాములు 2007 నుంచి 2013 వరకు ఎమ్మెల్సీగా పనిచేశారు.

జంగ్ తెలంగాణ

కేసీఆర్, కేటీఆర్‌ను కలిసిన నేతలు

నల్లగొండ : ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు(కేసీఆర్)ను నల్లగొండ జిల్లా పరిషత్ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి మంగళవారంహైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. నల్లగొండలో అత్యధిక మెజార్టీతో కంచర్ల భూపాల్‌రెడ్డిని మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని బండా నరేందర్‌రెడ్డికి, చా కిషన్‌రెడ్డికి సీఎం కేసీఆర్ సూచించారు. అనంతరం వారు రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను కూడా కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.


సీఎం కేసీఆర్‌తో బండా నరేందర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, చాడ కిషన్‌రెడ్డి

పోరుగడ్డ.. తుంగతుర్తి

- ఇక్కడి నుంచి ఎమ్మెల్యేలైన రాజకీయ ఉద్దండులు
- ప్రతి ఎన్నికల్లోనూ చివరి వరకు ఉత్కంఠే..!





అసెంబ్లీ ఫ్లాష్‌బ్యాక్

సూర్యాపేట: స్వాతంత్రోద్యమంతో పాటు నైజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమానికి గొప్ప నాయకులను అందించిన పోరుగడ్డ తుంగతుర్తి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈ నియోజకవర్గం ఎంతో కీలకమైనది. ఉద్దండులు ప్రాతి నిధ్యం వహించిన నియోజకవర్గంగా పేరొందిన ఈ స్థానానికి జరిగిన ప్రతి పోరూ ఉత్కంఠ రేకెత్తించింది. కొన్నేళ్లు కమ్యూనిస్టుల అడ్డాగా.. ఆపై కాంగ్రెస్ కంచుకోటగా ఈ ప్రాంతం పేరు పొందింది.

మూడు జిల్లాల పరిధిలో..!

2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా తుంగతుర్తి ఎస్సీ రిజర్వ్‌డ్‌గా మారింది. టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొత్త జిల్లాలు, మండలాలు ఏర్పాటు చేయడంతో తిరుమలగిరి, తుంగతుర్తి, నాగారం, అర్వపల్లి, మద్దిరాల, నూతనకల్ మండలాలు సూర్యాపేట జిల్లాలోకి వెళ్లాయి. మోత్కూరు, అడ్డగుడూరు యాదాద్రి జిల్లాలోకి వెళ్లాయి. శాలిగౌరారం మండలం నల్లగొండ జిల్లాలోకి వెళ్లింది.

పోరు హోరాహోరీ..!

తుంగతుర్తి ప్రాంతం 1952 ఎన్నికల వరకు సూర్యాపేట ద్విసభ్య నియోజకవర్గంగా ఉంది. తదనంతరం 1957, 1962లో నాగారం నియోజకవర్గ కేంద్రంగా ఉండేది. 1967 నుంచి తుంగతుర్తి నియోజకవర్గంగా ఏర్పడగా ఇప్పటి వరకు 13సార్లు ఎన్నికలు జరిగాయి. 1962, 1985, 1989, 2004లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. 1957లో సీపీఐ, 1967, 1978, 1983లో సీపీఎం అభ్యర్థులు గెలుపొందారు. 1999, 2009లో టీడీపీ విజయం సాధించింది. తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక నేతగా ఉన్న భీంరెడ్డి నర్సింహారెడ్డి 1957, 1967లో, సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం 1978, 1983లో సీపీఎం తరపున గెలుపొందారు. ఇక్కడి నుంచి కాంగ్రెస్ నేత దామోదర్‌రెడ్డి 1985, 1989, 1994, 2004 ఎన్నికల్లో గెలుపొందారు.

3 ఓట్లతో ఓడిన బీఎన్‌రెడ్డి

1957లో నాగారం నియోజకవర్గ కేంద్రంగా జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన భీంరెడ్డి నర్సింహారెడ్డి 1962లో అదే నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి అనిరెడ్డి రంగారెడ్డి చేతిలో 3 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. మొదటగా 100 ఓట్ల తేడా ఉండగా.. రీకౌంటింగ్‌లో 3 ఓట్లతో ఓడిపోయినట్లు అధికారులు ప్రకటించారు.

ఇప్పటి వరకు తుంగతుర్తిలో గెలిచిన ఎమ్మెల్యేలు వీరే..

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ
1967	భీంరెడ్డి నర్సింహారెడ్డి	సీపీఎం	రౌతు రాజేశ్వర్‌రావు	కాంగ్రెస్
1972	జి. వెంకటనర్సయ్య	ఇండిపెండెంట్	మల్లు వెంకటనర్సింహారెడ్డి	సీపీఎం
1978	మల్లు స్వరాజ్యం	సీపీఎం	శ్యాంసుందర్	ఇండిపెండెంట్
1983	మల్లు స్వరాజ్యం	సీపీఎం	శ్యాంసుందర్	ఇండిపెండెంట్
1985	ఆర్. దామోదర్‌రెడ్డి	కాంగ్రెస్	మల్లు స్వరాజ్యం	సీపీఎం
1989	ఆర్. దామోదర్‌రెడ్డి	కాంగ్రెస్	మల్లు స్వరాజ్యం	సీపీఎం
1994	ఆర్. దామోదర్‌రెడ్డి	ఇండిపెండెంట్	వర్ధెల్లి బుచ్చిరాములు	సీపీఎం
1999	సంకినేని వెంకటేశ్వర్‌రావు	టీడీపీ	ఆర్. దామోదర్‌రెడ్డి	కాంగ్రెస్
2004	ఆర్. దామోదర్‌రెడ్డి	కాంగ్రెస్	సంకినేని వెంకటేశ్వర్‌రావు	టీడీపీ
2009	మోత్కుపల్లి నర్సింహులు	టీడీపీ	గుడిపాటి నర్సయ్య	కాంగ్రెస్
2014	గాదరి కిశోర్‌కుమార్	టీఆర్‌ఎస్	అద్దంకి దయాకర్	కాంగ్రెస్
2018	గాదరి కిశోర్‌కుమార్	టీఆర్‌ఎస్	అద్దంకి దయాకర్	కాంగ్రెస్


అనిరెడ్డి రంగారెడ్డి


ఓరుగంటి వెంకటనర్సయ్య


భీంరెడ్డి నర్సింహారెడ్డి


మల్లు స్వరాజ్యం


రాంరెడ్డి దామోదర్‌రెడ్డి


సంకినేని వెంకటేశ్వర్‌రావు


గాదరి కిశోర్‌కుమార్

స్వతంత్రులకు సైతం పట్టం

నియోజకవర్గంలో స్వతంత్రులు, స్థానికేతరులు కూడా విజయం సాధించారు. 1972లో ఓరుగంటి వెంకటనర్సయ్యకు కాంగ్రెస్ పార్టీ తరపున టికెట్ రాకపోవడంతో ఆయన స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. 1994లో సిట్టింగ్ ఎమ్మెల్యే రాంరెడ్డి దామోదర్ రెడ్డిని కాదని కాంగ్రెస్ పార్టీ జెన్నారెడ్డి సుధీర్‌రెడ్డికి టికెట్ కేటాయించింది. దామోదర్‌రెడ్డి స్వతంత్ర్య అభ్యర్థిగా బరిలోకి దిగి సీపీఎం అభ్యర్థి వర్ధెల్లి బుచ్చిరాములుపై 1008 ఓట్ల తేడాతో విజయం సాధించారు. అదేవిధంగా స్థానికేతరులైన రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, మోత్కుపల్లి నర్సింహులు, గాదరి కిశోర్ తుంగతుర్తి నుంచి విజయం సాధించారు.

కేంద్ర బలగాల కవాతు

తుంగతుర్తి: అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రానికి కేంద్ర అదనపు పోలీసు బలగాలు చేరుకున్నాయి. సమస్యాత్మక ప్రాంతాల్లో ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు సోమవారం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఎన్నికల సమయంలో ఎలాంటి ఘర్షణలు జరగకుండా ముందస్తుగా ప్రజలకు అవగాహన కల్పించారు.


కవాతులో పాల్గొన్న కేంద్ర బలగాలు

భర్తను హత్య చేసిన భార్య, కుమారుడు

- ఆస్తి, అప్పుల విషయమై కొంతకాలంగా గొడవలు
- పథకం ప్రకారం కత్తిపీటతో తలపై నరికిన నిందితులు
- తుంగతుర్తి మండలం రామన్నగూడెం తండాలో ఘటన

తుంగతుర్తి: భర్తను కుమారుడితో కలిసి భార్య హత్య చేసింది. ఈ ఘటన తుంగతుర్తి మండలంలోని రామన్నగూడెం తండాలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నగూడెం తండాకు చెందిన భూక్య హర్జ(49), కైక భార్యాభర్తలు. వీరికి కుమారుడు సురేష్ ఉన్నాడు. కొంతకాలంగా హర్జ, కైక మధ్య తమకున్న ఆస్తి, అప్పులకు సంబంధించిన విషయమై గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో నాలుగు నెలల క్రితం కైక భర్త హర్జతో గొడవపడి హైదరాబాద్‌లో ఉంటునన్న కుమారుడు భూక్యా సురేష్ వద్దకు వెళ్లి అక్కడే ఉంటుంది. హర్జతో నిత్యం గొడవలు జరుగుతుండటంతో తల్లి, కొడుకు కలిసి అతడిని హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో కైక, సురేష్ కలిసి దసరా పండుగకు రామన్నగూడెం వచ్చారు. సోమవారం రాత్రి దసరా ఉత్సవాలు పూర్తయిన తర్వాత హర్జ, కైక, సురేష్ తమ ఇంట్లో నిద్రించారు. ముందు అనుకున్న పథకం ప్రకారం.. కైక, సురేష్ కలిసి అర్ధరాత్రి గాడ నిద్రలో ఉన్న హర్జను ఇంట్లో ఉన్న కత్తిపీటతో తలపై నరికి దారుణంగా హత్య చేశారు. మంగళవారం తెల్లవారుజామున తల్లి, కొడుకు కలిసి ఇంట్లో నుంచి పరారయ్యారు. మృతుడి సోదరుడు భూక్య సుందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బ్రహ్మమురారి తెలిపారు.


హర్జ మృతదేహం

రోడ్డు ప్రమాదంలో కౌలు రైతు దుర్మరణం

మునగాల(కోదాడ): రోడ్డు ప్రమాదంలో కౌలు రైతు దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన మునగాల మండలపరిధిలో చోటుచేసుకుంది. మునగాల ఎస్‌ఐ పి.లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నారగాని వెంకన్న(40) కొంతకాలంగా కౌలు సేద్యం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి తన బైక్‌పై గ్రామశివారులో గల ఎస్‌ఎస్పీ కెనాల వద్దకు జాతీయ రహదారిపై వెళుతుండగా వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం అతివేగంగా వచ్చి ఢీకొట్టి వెళ్లింది. ఈ ప్రమాదంలో వెంకన్న తలకు, కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి కోదాడ ప్రభుత్వ అస్పత్రిలో శవపరీక్ష నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ లోకేష్ తెలిపారు.


నారగాని వెంకన్న మృతదేహం

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

చింతపల్లి : హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై చింతపల్లి మండల పరిధిలోని నసర్లపల్లి గ్రామ సమీపంలో మంళవారం తెల్లవారుజామున ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్‌ఐ సతీష్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండమల్లేపల్లి గ్రామానికి చెందిన వీరమళ్ల వేణుగోపాల్ మల్లేపల్లి వైపు హైదరాబాద్ వైపునకు స్కూటీపై వెళ్తుండగా హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గిద్దలూరుకు వెల్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా ఢీకొట్టింది. దీంతో వేణుగోపాల్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మూసీనదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పాలకవీడు: మండల పరిధిలోని శూన్యపహాడ్ గ్రామం శివారు మూసీనది చెక్‌డ్యాం సమీపంలో గుర్తు తెలియని మృతదేహం మంగళవారం లభ్యమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం ఉదయం మూసీనదిలో తేలియాడుతున్న మృతదేహాన్ని స్థానిక రైతులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలనికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడి ఒంటిపై గ్రే కలర్ టీషర్టు, బ్లాక్ పాయింట్ ధరించినట్లు తెలిపారు. సుమారు నాలుగైదు రోజుల క్రితం ఈ ఘటన జరిగినట్లు పోలీసులు భావించారు. మృతుడి వయసు సుమారు నలభైఐదు సంవత్సరాలు ఉండవచ్చని అంచనా వేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై లింగయ్య వెల్లడించాడు.

స్కూటీ ఢీకొని వృద్ధురాలు మృతి

ఆత్మకూరు(ఎం): స్కూటీ ఢీకొని వృద్ధురాలు మృతిచెందింది. ఈ ఘటన ఆత్మకూరు మండలంలోని రాయిపల్లి–కొండాపురం స్టేజీల మధ్య సోమవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన పలుసం జగన్నాథం స్కూటీపై భువనగిరికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. అదే సమయంలో సర్వేపల్లి గ్రామానికి చెందిన బిటుకూరి లక్ష్మమ్మ(89) కొండాపురం వైపు నడుచుకుంటూ వెళ్తుండగా.. రాయిపల్లి–కొండాపురం స్టేజీల మధ్య స్కూటీ ఆమెను కొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మమ్మ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందింది. పలుసం జగన్నాథంకు గాయాలు కావడంతో స్థానికులు భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


లక్ష్మమ్మ మృతదేహం

సాగర్‌లో పాట్నా, ఒడిశా హైకోర్టు జడ్జీలు


బుద్ధుడి పాదాలకు పుష్పాంజలి ఘటిస్తున్న జస్టిస్ అంజనీకుమార్


బుద్ధవనంలో ఒడిశా హైకోర్టు జడ్జి జస్టిస్ గౌరీశంకర్ సత్పతి

నాగార్జునసాగర్: అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా పేరుగాంచిన నాగార్జునసాగర్‌కు మంగళవారం పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అంజనీ కుమార్‌శరణ్, ఒడిశా హైకోర్టు జడ్జి జస్టిస్ గౌరీశంకర్ సత్పతి కుటుంబ సమేతంగా వచ్చారు. నాగార్జునసాగర్ ప్రధాన డ్యాం, బుద్ధవనం సందర్శించారు. బుద్ధవనంలోని బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం బుద్ధ చరిత వనం, జాతకవనం, ధ్యానమనం, మహాస్థూపం సందర్శించి కొద్దిసేపు అక్కడ ధ్యానం చేశారు.

దసరా వేడుకల్లో హైకోర్టు జడ్జి


బోగారం అంజనేయస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న జడ్జి జస్టిస్ లక్ష్మణ్‌గౌడ్

రామన్నపేట: మండలంలోని బోగారం గ్రామంలో సోమవారం జరి గిన దసరా వేడుకల్లో హైకోర్టు జడ్జి జస్టిస్ కూనూరు లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు. సర్పంచ్ అంతటి పద్మారమేష్ ఆధ్వర్యంలో గ్రామస్తులు జడ్జికి ఘన స్వాగతం పలికారు. స్థానికులతో కలిసి ప్రదర్శనగా వెళ్లి జమ్మిచెట్టుకు పూజలు చేశారు. అనంతరం స్వగ్రామంలోని అంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. తల్లిదండ్రుల వద్ద ఆశీర్వాదం తీసుకున్నారు. ఆయన వెంట సర్పంచ్ అంతటి పద్మారమేష్, ఎంపీటీసీ గోగు పద్మా సత్తయ్య, మాజీ గ్రంథాలయ చైర్మెన్ జెల్ల మార్కేండేయ, మాజీసర్పంచ్ గంపల రామచంద్రారెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ బద్దుల ఉమారమేష్, న్యాయవాది కూనూరు మహేష్, కోడి పాండు ఉన్నారు.

దసరా వేడుకల్లో రెండు వర్గాల మధ్య ఘర్షణ

- పలువురికి గాయాలు
- ఒకరిపై ఒకరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): పాత కక్షలతో దసరా వేడుకల సందర్భంగా రెండు వర్గాలు ఘర్షణకు పాల్పడ్డారు. ఈ ఘటన ఆత్మకూర్ మండలంలోని మక్త కొత్తగూడెం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మక్త కొత్తగూడెం గ్రామానికి చెందిన కొల్లా అంజయ్య, ఉపేందర్ మధ్య దసరా పండుగ సందర్భంగా సోమవారం స్వల్ప వివాదం జరిగింది. చుట్టుపక్కల వారు ఇరువురికి సర్ది చెప్పి పంపించగా ఉపేందర్ అదే గ్రామంలో మరో వర్గంను ఉసిగొల్పడంతో ఏర్పుల అంజయ్య, ఏర్పుల గంగయ్య, ఏర్పుల సైదులు, ఏర్పుల వెంకన్న, ఏర్పుల చౌడయ్యలు మరో వర్గం అయిన కాసాని నాగయ్య, వంగాల అంజయ్య, కొప్పు మధు, వంగాల రామ్మూర్తిపై పాత కక్షలు మనసులో పెట్టుకుని దాడి చేసుకున్నారు. ఈ దాడిలో పలువురికి గాయాలయ్యాయి. ఇరువర్గాలు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోగా ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపారు. అధికార పార్టీకి చెందిన ఇరువర్గాల మధ్య గత కొంతకాలంగా నెలకొన్న పాత కక్షలు ఒక్కసారిగా బయటపడి ఘర్షణకు దారి తీసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో బత్తాయి తోట దగ్ధం

హాలియా: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సుమారు ఏడెకరాలలో సాగుచేసిన బత్తాయి తోట దగ్ధమైంది. ఈ ఘటన సోమవారం అనుముల మండలంలోని మారేపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మారేపల్లి గ్రామానికి చెందిన రైతులు మారబోయిన మంగమ్మ ఐదెకరాల్లో, మారబోయిన లింగయ్య రెండెకరాల్లో బత్తాయి తోటను సాగు చేస్తున్నారు. సోమవారం ఈ తోటకు సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. ఈ మంటలు బత్తాయి తోటకు అంటుకుని బత్తాయికాయలు, మోటార్ల పైపులు, స్టాటర్లు, డ్రిప్ పైపులు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని, బత్తాయి తోట చేతికొచ్చిన సమయంలో అగ్ని ప్రమాదం జరగడంతో ఆర్థికంగా నష్టపోయామని, ప్రభుత్వ తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

యాదాద్రిలో వైభవంగా దసరా ఉత్సవాలు


ఆలయ తూర్పు మాఢ వీధిలో శమీ వృక్షానికి పూజలు చేస్తున్న ఆచార్యులు, ఈఓ గీతారెడ్డి తదితరులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో మంగళవారం దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి అమ్మవార్లను ఆచార్యులు ప్రత్యేకంగా అలంకరించి, ఆలయ తిరు, మాఢ వీధుల్లో గజవాహన సేవపై ఊరేగించారు. అనంతరం తూర్పు మాఢవీధిలో స్వామిని అధిష్టించి, అక్కడే ఏర్పాటు చేసిన శమీ వృక్షానికి ఆగమశాస్త్ర ప్రకారం పూజలు నిర్వహించారు. అనంతరం శమీ వృక్షానికి జమ్మి ఆకును తీసుకొని శ్రీస్వామి వారికి సమర్పించారు. శమీ వృక్షానికి జమ్మి ఆకును తీసుకునేందుకు అధికారులు, భక్తులు పోటీపడ్డారు. ఈ వేడుకలో ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహ మూర్తి, ఆలయాధికారులు, అర్చకులు పాల్గొన్నారు. ఇక సోమవారం శివాలయంలో విజయదశమి ఉత్సవాన్ని ఘనంగా చేపట్టారు. యాదగిరిగుట్ట పట్టణంలో సైతం దసరా వేడుకలను ప్రజలు సోమ, మంగళవారం రెండు రోజులు జరుపుకున్నారు.